# పీటర్ గారి స్కూటర్

పీటర్‌గారు, స్కూటర్ కొన్నారన్న వార్త. ఛార్టర్ ప్లేన్‌ని రష్యా కూల్చేసింది అన్న వార్త కంటే, ఇరాక్ మీద అమెరికా దాడి చేసింది అన్న సమాచారం కంటే కూడా ఎక్కువ సంచలనాన్ని కలిగించింది మా ఊళ్ళో. ఏ మొగలో చూసినా దీని గురించి విడ్డూరంగా చెప్పుకోవడమే. ఏ మనిషిని పలకరించినా ఈ ప్రస్తావన తెచ్చి ఆశ్చర్యపోవటమే. ఊరు ఊరంతా ఈ మాట విని, "ఆఁ!" అంటూ నోరు తెరిచి, ఆ మట్టున ఉండిపోయింది అక్షరాలా.

అవును మరి, ఆయన సైకిల్ తొక్కడమే అదో ప్రత్యేకమైన పద్ధతీ, విశిష్టమైన విధానమూను. ఇంక స్కూటర్ నడపటం చెప్పాలా? సైకిల్ సాయంతోటే ఆయన ఊళ్ళో అశేష జనావళి గుండెల్లోనూ రైళ్ళు పరిగెట్టించారే! ఇంక స్కూటర్ ధర్మమా అని విమానాల్నే హోరెత్తిస్తారో, రాకెట్లనే దూసుకుపోయేలా చేస్తారో, ఏమో మహాప్రభూ, ఏం చేస్తారో అని ప్రజలంతా ఊపిరి బిగబట్టుకుని మరీ ఎదురు చూడసాగారు.

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. పీటర్‌గారు సైకిలు ఎక్కడం దగ్గర్నుంచి, దాన్ని తొయ్యడం, తొక్కడం, నడిపించడం, మలుపులు తిప్పటం, మనుష్యుల నుంచి తప్పించడం వంటి సర్కస్ ఫీట్స్‌తో సహా దాని మీంచి దిగడం వరకూ, అదంతా అదొక తరహా - అదంతా ఒక ప్రత్యేకత.

సైకిలు వేషమని, ఆ వేషమే వేరు. ఆ దుస్తులూ, ఆ సరంజామా, అంతా సిద్ధం చేసుకుని బయలు దేరడానికి అధమం అరగంట పట్టేది. మామూలుగా పక్కగోచీ ఎడంకాలి మీదకి షోగ్గా రానిచ్చి, కుచ్చిళ్ళని కుడి చేత్తో విలాసంగా పట్టుకుని నడిచే పంచెకట్టు పద్ధతి, సైకిలు దగ్గరికి వచ్చే సరికి సంపూర్ణంగా మారిపోయేది.

సైకిలు ఎక్కబోయే ముందు, పంచెని సమానంగా ఇటూ - అటూ రెండు కాళ్ళ మీదకీ వచ్చేటట్లు విరిచి కట్టేవారు.

దాంతో పంచె కాస్తా పేంట్ లాగ అయ్యేది. ఆ ఫేంట్ పంచెతో కాళ్ళు 'ఫ్రీ'గా

ఆడుతూన్నయో లేదో, రెండు మూడుసార్లు ఝూడించి మరీ చూసుకొనేవారు. ఆ పైన రెండు పిక్కలకీ రెండు క్లిప్పులు తగిలించేవారు. మామూలు సమయాల్లో మామూలుగా ఉంచేసినా, సైకిలు ఎక్కేటప్పుడు మాత్రం షర్టుని పంచెలో టక్ చెయ్యడం తప్పనిసరి. అలాగే అరిచేతి వెడల్పు బెల్టు ఒకటి నడ్డికి గట్టిగా బిగించడం కూడా అంతే తప్పనిసరి సైకిల్ తొక్కే హడావిడిలో పంచె జారిపోకుండా. పొడుగు చేతుల చొక్కా అయితే అవశ్యం మోచేతులు దగ్గరికి మడవాల్సిందే! బొత్తాములు సరేసరి, కిందనుంచి పీక దాకా ఉన్నవన్నీ బిర్రబిగిసి ఉండాల్సిందే! సైకిలు ఫెడల్స్‌కీ హవాయి చెప్పులకీ సహం ఎరిక అనే సంగతి సర్వులకూ తెలిసిందే కదా! అవి ఎప్పుడు విడాకులు ఇచ్చి పుచ్చుకుంటాయో. అందువల్ల బెల్టు షూ కాని, అవకాశాన్ని బట్టి పుల్ షూ కాని వెయ్యక తప్పదు. అవునా?

ఇలా యుద్ధభూమికి సిద్ధం అయే సైనికుడిలా సకల బందోబస్తులూ పూర్తిచేసి పీటర్‌గారు సైకిల్‌ని "గేరేజి" లోంచి తీసేవారా?... గేరేజీ అంటే అదే - ప్రహారీ గోడకీ సందులో ఉన్న మందార నందివర్ధన చెట్ల తాలూకు గుబురుకీ మధ్య అన్నమాట - ప్రకృతిప్రసాదించిన ఆ గేరేజీ లోంచి తీసి, సైకిల్‌ని అలా అలా రోడ్డు మీద కొంత దూరం విలాసంగా నడిపించేవారు, ఏ మైలు రాయో, వీధిలోకి పొడుచుకు వచ్చిన ఏ గచ్చు అరుగో, కనీసం ఏ మ్యునిసిపాలిటీవారి చెత్త కుండీయో, కాలు మోపడానికి తటస్థపడేవరకూ. అది అమిరేక ఆ పాదపీఠం మీద ఓ కాలేసి, అమాంతం సీటు మీదకి ఉరికి అప్పుడు పోనిచ్చే వారన్నమాట సైకిలుని. కర్మం చాలక కాలూనే పాదపీఠం కనుచూపు మేరలో కనిపించలేదనుకోండి. అప్పుడు మరో ఉపాయం ఉండనే ఉంది. వెనక చక్రం పోర్క్‌మీద ఓ కాలేసి, రెండో కాలితో నేలని నెట్టి నెట్టి, ఉన్నట్టుండి కేరియర్ మీంచి సీటు మీదకి, పక్షిలా ఎగిరి చేరుకొని, ఆ పైన సైకిలు స్వారీ ప్రారంభించడం.

కృత్యాద్యవస్థ ఇలా పూర్తిచేసి సైకిలూ ఆయనా వీధినబడేవారు. రోడ్డు మీద జనం ఉండనీండి ఉండకపోనీండి. ఉన్నవి కేవలం, గేదెలూ వాహనాలు, లైటు స్థంబాలు కంకర గుట్టలూ, అయితే అవుగాక, ఆయన బెల్ కొట్టవలిసిందే.అవి తప్పుకొన్నాయా తప్పుకోలేదా అనే మీమాంస ఆయనకి అనవసరం. సైకిలు ఎక్కింది మొదలు దిగేదాకా ఆపకుండా సైకిలు బెల్ కొట్టామా లేదా అన్నదే ఆయనకి ముఖ్యం. మరీ ట్రాఫిక్ రద్దీగా ఉంటే అమాంతం సైకిలు మీంచి ఉరికెయ్యనేనా ఉరికేసేవారు. లేకపోతే హేండిల్‌బారు ఇటూ అటూ ఊపేస్తూ గంట గణగణమని వాయించేస్తూ,

దానికి తోడుగా "తప్పుకోండి తప్పుకోండి" అంటూ పెద్ద పెద్ద కేకలు కూడా పెట్టేవారు. ఈ సైకిలు సవారీతో, పీటర్‌గారు ప్రజల్లో ఎంతటి చైతన్యాన్నీ భీభత్సాన్నీ సృష్టించి వాళ్ళ గుండెల్లో ఎన్ని రైళ్ళు పరుగెట్టించినా, ఆ గలాభాకి గాభరాపడి, దురదృష్టజీవులెవరేనా ఆయన సైకిల్ కింద పడవలసిందే కాని, కంగారు పడి ఆయన మాత్రం ఎప్పుడూ సైకిల్ మీంచి కిందపడలేదు. ఆ విషయంలో ఆయన్ని ఎంతగానో మెచ్చుకోవాలి.

అవునా? అటువంటి పీటర్‌గారు స్కూటర్ కొన్నారంటే, ప్రజల్లో వెధవ్వి, రైళ్ళేవిటి, విమానాలే పరిగెట్టవ్? అందుకే ఆ సంగతిని ఆటంబాంబు పడిందన్న వార్తలా భయోత్పాతంగా విని, నోళ్ళు తెరిచి దానికి తోడు ఊపిరి కూడా బిగబట్టి ఆ మట్టున ఉండిపోయారు, మా ఊళ్ళో అశేష ప్రజానీకమున్నూ, గ్రూప్ ఫోటో కోసం నిలబడ్డ జనాభాలాగ.

'అసలు ఈయన స్కూటరెందుకు కొనడం, సైకిలు చాల్లేదేవిటి మనల్ని చంపడానికి?' అంటూ ఊరిలోని పెద్దలంతా కలిసి టౌనుహాల్లో పెద్ద సభ చేసి మరీ చర్చించారు. చర్చించగా చర్చించగా చివరకు తేలిన సారాంశం ఏమిటయ్యా అంటే, దీన్ని ఆయన కొనలేదనీ, ఏదో ఆషామాషీగా పోటీకి దేనికో పజిల్ పంపితే దానికి బహుమతిగా ఆయనకిది వచ్చిందనీ, వచ్చి పది పదిహేను రోజులయినా, వారం వర్జ్యం కుదరక కొంతా, బజారులో నిమ్మకాయల ఖరీదు విపరీతంగా ఉండడం కొంతా, కారణంగా, ఇప్పటికి కూడా ఆయన స్కూటర్‌ని వీధిన పెట్టలేదనీను. నిమ్మకాయలకీ స్కూటర్‌కీ సంబంధం ఏమిటంటే, కొత్త స్కూటర్‌ని ఎక్కేముందు నిమ్మకాయల గుత్తి ఒకటి స్కూటర్‌కి కట్టి, రెండు మూడు నిమ్మకాయల మీంచి మొదటగా ముందు చక్రం పోనిస్తే తప్ప, యజమాని మాట ఎలా ఉన్నా ఊరిలోని ప్రజలకి పెద్ద అరిష్టం. పోన్లే నిమ్మకాయల ధర మండిపోవడం కూడా ఒకందుకు మంచిదే అని సమావేశం అయిన పెద్దలంతా, బరువు తీరినట్లు శ్వాస వదిలారు. కాని అలా శ్వాస వదిలినంతసేపు పట్టలేదు.

ఓ రోజు ప్రొద్దుటే ఇంకా పూర్తిగా తెల్లవారక ముందే కొత్త స్కూటరూ, ఆ స్కూటరు మీద పీటరుగారూ కనిపించారు రోడ్డు మీద. అయినా ఆయన వేసుకున్న దుస్తులూ ధరించిన వేషమూ మాత్రం పూర్వానికి భిన్నంగా ఉంది. మామూలు సైకిలు వేషంలా లేదు. అందమైన టెర్లిన్ ఫేంటూ, చుక్కల చెక్ బుష్ షర్టూ. కళ్ళకి చలవ జోడూ. కాళ్ళకి ఖరీదైన కాన్వూర్ చెప్పులూ, అలంకారం మంచి ట్రిమ్‌గా ఉంది.

అవును మరి! నాలుగు వందలు ఖరీదైన సైకిలుకీ పదివేలు పైన పలికే స్కూటర్‌కీ తేడా లేదూ? రామ భజనకీ, రాయల్ సొసైటి మీటింగ్‌కీ ఒకే రకమయిన డ్రెస్‌లో వెళతామా? దేని దర్జా దానిదే. దేని హోదా దానిదే.

సరే రోడ్డు మీద పీటర్‌గారి స్కూటర్ పోతోంది. అదో పట్టపు టేనుగులాగా, ఆయనో మహారాజులాగా కనిపించారు ప్రజల కళ్ళకి. అందరూ బారులు తీర్చి రోడ్డుకి ఇటూ అటూ నిలబడి చోద్యంగా చూస్తున్నారు. సాక్షాత్తూ పట్టపుటేనుగు లాగే తాపీగా, నడుస్తోంది స్కూటరు. దాని మీద పీటర్‌గారు దర్జావల్లో భయం వల్లో ఊపిరి బిగబట్టుకుని మరీ కూర్చున్నారు. ఇష్టం లేని ఊరేగింపులో బిర్రబిగిసి కూర్చున్న పెళ్ళి కొడుకులాగ ఉన్నారు. ఊరేగింపు సాగుతోంది. దర్జాగా, హుందాగా, మందమందంగా.

ఉన్నట్టుండి రయ్‌మంటూ ఓ పెద్ద దౌడు తీసి, చటుక్కున ఓ చోట అమాంతం ఆగిపోయింది పట్టపుటేనుగు. ఒక్క అరక్షణం ఆలస్యం అయితే మినువుల మూట లాగ దిబ్బుమంటూ స్కూటర్ మీంచి కింద పడేవాడే పీటర్‌గారు. జరగబోతున్న ప్రమాదాన్ని అరక్షణంలో పసిగట్టి, అంత వరకూ రోడ్డు పక్క నిలబడి చోద్యం చూస్తూన్న జనంలోంచి నలుగురు మనుష్యులు ఇద్దరు ఇటు నుంచీ, ఇద్దరు అటునుంచీ పరిగెట్టుకుని వచ్చి స్కూటర్‌ని అమాంతం పట్టుకుని, ఇటూ అటూ ఎటూ పడకుండా నుంచో పెట్టారు. ఏం జరిగిందో అర్థం కాక బిర్ర బిగిసి కూచుని బెదురు చూపులు చూస్తున్న పీటర్ గారిని స్కూటర్ మీంచి దింపి, "ఏమైందయ్యా మహానుభావా! ఏం చేసావు? ఉన్నట్టుండి ఎందుకు ఆగిపోయింది?" అని అడిగితే ఏమో అంటాడే కాని సమాధానం చెప్పడే! చివరికి "ఏ యాక్సిలరేటరో తగ్గించి ఉంటాడు. గేర్ న్యూట్రల్లోకి తెచ్చాడేమో. బ్రేక్ వేసి ఉంటాడు. బహుశా పుష్ బటను నొక్కి ఇంజను ఆపి ఉండాలి" అంటూ తమలో తామే ఎవరికి తోచిన సమాధానం వాళ్ళు చెప్పుకుని సంతృప్తి పడ్డారు.

తర్వాత పీటర్‌గారి స్కూటర్ తరుచు వీధుల్లో కనిపిస్తూనే ఉంది. ఓ మారు ఒంటెద్దు బండిలా కుంటుతూనూ, మరో మారు సూపర్ జెట్‌లా దూసుకుపోతూనూను. అది ఎప్పుడు ఏ స్పీడుతో పోతుందో ఏ సమయంలో ఎటు తిరుగుతుందో, ఎక్కడ ఎలా ఆగిపోతుందో, ఊళ్ళో వాళ్ళెవ్వరికీ తెలియదు. సరే. ఆయనకి ముందే తెలియదు. "ఏవిటండీ పీటరు గారూ! సమానమైన స్పీడులో వెళ్ళరేం? ఉన్నట్టుండి ఆలా పరుగులు పెట్టిస్తారేవిటి స్కూటరుని?' అని కనుక ఎవరేనా అడిగితే "అదే అర్థం కావడం లేదండి? ఎందుకు ఏం జరుగుతోందో ఆశ్చర్యంగా ఉంటోంది.

ఏమైనా. అశ్వహృదయంలాగ స్కూటరు హృదయం కూడా, అదో నిగూఢమైన శాస్త్రంలా ఉంది'' అంటూ చిరునవ్వులు ఒలకబోస్తారు.

పీటరుగారన్నట్లు ఆయన స్కూటరుకి ప్రత్యేకమైన అభిప్రాయాలూ, కొన్ని రకాలయిన ఇష్టాయిష్టాలూ, తనదీ అనే ఒక వేర్పాటయిన వ్యక్తిత్వం, ఉన్నట్టున్నాయి.

ఫలానా చోట ఆయన ఆగాలనుకుంటే అది ఎప్పుడూ అక్కడ ఆగదు. పది గజాలు ఇవతలో పాతిక గజాలు అవతలో ఆగాల్సిందే.

రోడ్డు అన్నాక అక్కడక్కడ గోతులూ ఉంటాయి. అటూ ఇటూ గుట్టలూ వుంటాయి. మిగిలినదంతా సాఫీగా వుంటుంది కదా! సాఫీది అంత రోడ్డున్నా, అదేవిటో దానికి గోతుల్లోంచి పోవడమూ, గుట్టల్ని ఎక్కి దూకడమూ అంటేనే సరదా. గోతులూ, రాళ్ళూ, పేవ్‌మెంట్లూ ఇవన్నీ సూదంటు రాళ్ళలా ఆకర్షిస్తాయి కాబోలు.

మనుష్యులు కనిపిస్తే చాలు. దానికి వీరావేశం వస్తుంది. అక్కడికీ వాళ్ళు ఎంతో ఒదిగి ఒదిగి పేవ్‌మెంట్ల మీదకి ఎక్కేస్తూనే వుంటారు. అయినా సరే, పగబట్టిన తాచులా వాళ్ళని తరుముతుందేకాని ఓ పట్టాన వదలదే!

స్కూటరు భూచరం కదా. భూమిని అంటిపెట్టుకుని నేలమీద నడవాలా వద్దా? ఊహుఁ! దానికి ఆ పట్టింపులు ఏం లేవు. రోడ్డు మీద నీళ్ళు కనిపిస్తే సరి, జలచరంలా ఈదుతుంది. లేకపోతే, వాయుచరంలా ఎగురుతూ వెళ్ళవలసిందే. కాని, ఏ కోశానా భూచరం బుద్ధులు లేవు దానికి.

అన్నింటికీ తోడు దానిదో, గంగానమ్మ కడుపు. అందరికీ లీటర్ పెట్రోలూ పాతిక ముప్ఫైకిలో మీటర్ల దాకా వస్తూంటే, పీటర్ గారి స్కూటర్‌కి పదికూడా రాదు. పెట్రోలు పోసేటప్పుడల్లా బంకులో కుర్రాడు అంటూనే వుంటాడు "పూర్వజన్మలో ఇది బకాసురుడో మరిడమ్మవారో నండీ! పూర్ణకుంభం పూర్తిచేస్తే కాని పూనకం రాదు దీనికి'' అని.

"పూనకం వచ్చి ఊరుకోవడం లేదండి బాబూ! ఆ పూనకంలో భూత బలులు కూడా పుచ్చుకుంటోంది'' అన్నారీమధ్య ఎవరో నాతో.

కూర్ల వెంకన్న హాస్పిటల్‌కి వెళ్ళి రోజూ కాలుకి కట్టుకట్టించుకుంటున్నాడంటే అది పీటర్‌గారి స్కూటర్ ధర్మమేట.

అలాగే టీచర్ సుశీలాను, నడ్డి ఇంకా నయం కాక స్కూలికి నెల్లాళ్ళు శలవు పెట్టి మంచం మీద ఆ మట్టునే పడి వుందిట ఈ రోజుకి కూడా.

సింహాద్రిగాడి రిక్షా,ముందు చక్రం అష్టవంకర్లు పోవడానికీ, రెవిన్యూ ఇనస్పెక్టరుగారు

సైకిలు సమేతులై ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి పల్టీలు కొట్టడానికీ, ట్రాఫిక్ పోలీసు నాలుగు రోడ్ల మొగలో వున్న ట్రాఫిక్ ఐలెండ్ వదిలి పారిపోడానికీ, పింగాణీ కప్పులూ సాసర్లూ గాజు సామానులూ చక్రాల బండి మీద పెట్టుకుని అమ్ముకునే సాంబయ్య "నా కూడు పడిపోయిందో" అంటూ ఘొల్లుమని ఏడవడానికీ, ఊళ్ళో రోజుకి రెండు కోడి పెట్టలో ఓ పందిపిల్లో ఈ పాడు ప్రపంచం నుంచి పై ప్రపంచంలోకి వెళ్ళిపోవడానికీ అన్నింటికీ పీటర్‌గారి స్కూటరే కారణం అంటారు ఊళ్ళో చాలా మంది. మరి అందులో నిజం ఎంతో, అబద్ధం ఎంతో, అంతా కాకపోయినా కొంత అయినా కిట్టని వాళ్ళు కల్పించి వుంటారని నా గట్టి నమ్మకం. కొందరు కావాలని కోడి పెట్టల్నీ, కుక్క పిల్లల్నీ దారిలో వదిలేసి, "ఇదిగో దానికాలు విరిగింది, అదిగో దీని కన్ను పోయిందంటూ" పీటరుగారి దగ్గర్నుంచి పదీ పాతికా గుంజుతూన్నారని వదంతి. "ఏవిరా?" అని వాళ్ళని అడిగితే వాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వుతూ "ఆయన ధర్మాత్ముడు బాబూ! ఆయన ధర్మమా అని మాకీ మధ్య పస్తులు తప్పాయి" అని పొగడడం కూడా ఈ మధ్యన ఊళ్ళో అక్కడక్కడ వినిపిస్తోంది.తిట్లూ శాపనార్థాల మధ్య అప్పుడప్పుడు వినిపిస్తూ వచ్చిన ఈ పొగడ్తలే వినిపించి వినిపించి, ఓ రోజున నిజం అయి ఊరుకున్నాయి.

మా ఊళ్ళో యువజన సమితి అని ఒకటుంది ఎన్నాళ్ళ నుంచో. ఆ సమితి సభ్యులు పాతిక ముప్పై మంది అయితే ఓ రోజు ఉదయాన్నే "పీటర్ గారికీ జై ... ఆయన స్కూటర్‌కీ జై" అంటూ వీధుల్లో ఊరేగసాగారు. జయ జయ ధ్వానాలు విని వీధిలోకి వచ్చి చూద్దును గదా, ముందొక టైరు బండి మీద స్టేండు వేసి ఉన్న స్కూటరూ, దాని మీద చిరు నవ్వులు చిందిస్తూ కూర్చున్న పీటరూ. స్కూటర్ హేండిల్ చుట్టూను ఆయన మెడ చుట్టూను పూలదండలు. వెనకాలే జే... జే లు చెబుతూ యువజన సమితి సభ్యులూ ఆ వెనక ఈలలు వేస్తూ చప్పట్లు చరుస్తూ ఊళ్ళో కొందరు జనం.

ఊరేగింపు మాంచి రంజుగా ఉంది....

అంతా సంతోషంతో కేరింతలు కొట్టే వాళ్ళే కాని, "ఏవిటయ్యా సంగతి? ఏం జరిగింది? పీటర్‌నీ ఆయన స్కూటర్‌నీ ఎందుకు ఊరేగిస్తున్నారు" అని అడిగితే ఒక్కళ్ళూ సమాధానం చెప్పరే. చివరికి ఊరేగింపులో చివరగా కాళ్ళీడుస్తూ నడిచి వెళుతూన్న ఓ యువకుణ్ణి నుంచోపెట్టి ఆపి,మరీ అడిగాను "ఏవిటి సంగతి?" అని.

వాడు నాకేసి ఎగాదిగా చూసి "మీకింకా తెలియదా?" అన్నాడు.

"ఏవిటీ?" అన్నా

"ఏడెనిమిదేళ్ళ నుంచి కాలు పెట్టడానికి వీలు లేకుండా రోడ్డుమీద ఇటూ అటూ కిళ్ళీదుకాణాలూ, టీ స్టాల్సూ, బడ్డీ కొట్లూ, పళ్ళు అమ్మేబళ్ళూ వెలిశాయి గదా?"

"అవును రోడ్డు మహా ఇరుకయి యాక్సిడెంట్లు అవుతున్నాయి."

"ఆ ఆక్రమణలని తొలగించమని మా సమితి ఇటు మ్యునిసిపాలిటీకీ, అటు కలెక్టరుకీ గవర్నమెంటుకీ ఎన్ని అర్జీలు పంపింది, ఎన్ని సత్యాగ్రహాలు చేసింది?"

"ఏం లాభం? ఏదీ ఫలించలేదుగా?"

"అవునా? ఇన్నేళ్ళుగా ఎవరం సాధించలేంది వారం రోజుల్లో పీటర్ గారు తమ స్కూటర్‌తో ఇట్టే సాధించిపారేశారు. ఇప్పుడు మన ఊళ్ళో రోడ్డు పక్క ఒక్క దురాక్రమణ ఉంటే ఒట్టు. అందరూ ఖాళీ చేసి పారిపోయారు. పోనీ ఓ కొట్టో, ఓ బండో పెట్టుకోండయ్యా అన్నా ఎవరూ అందుకు సాహసించి ముందుకి రావడం లేదు" అంటూ ఆ కుర్రాడు చెబుతూంటే నాకు ఎంత ఆనందం కలిగిందో చెప్పలేను. "పీటర్‌గారి స్కూటర్‌కీ జై!" అంటూ అప్రయత్నంగా ఒక కేక వెలువడింది ఆశ్చర్య ఆవేశాలతో బొంగురు పోయిన నా కంఠంలోంచి.

*(1976 విజయ)*